## పదేళ్ల పాలనలో నిరుద్యోగుల జీవితాలతో బిఆర్ఎస్ చెలగాటం : జెసి చైర్మన్ శ్రీహరి



స్వీట్లు పంచుతూ సంబురాలు చేసుకుంటున్న చైర్మన్ భట్టు శ్రీహరి తదితరులు

**తార్నాక, ఆగస్టు 3 ప్రభాతవార్త:** దేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని జేఏసీ చైర్మన్ బట్టు శ్రీహరి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో జాబ్ కేలండర్ ప్రవేశపెట్టడం పట్ల టీజేఏసీ,టీఎస్ జేఏసీ చైర్మన్ బట్టు శ్రీహరి హర్ష వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ.యూ కళాశాల వద్ద జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి ఆద్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామి మేరకు జాబ్ కేలండర్ విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ మాట నిలబెట్టుకుందన్నారు. పేపర్ లీకేజీలు, విధ్యార్థి వ్యతిరేక కార్యకలాపాల కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను తమ కల్వకుంట్ల కమిషన్‌గా మార్చుకొని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మాట మీద నిలబడి వాగ్దానాలు నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడేటప్పుడు బిఆర్ఎస్ నాయకులు ఒళ్లుదగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకొండ సుభాష్ రెడ్డి, రవీందర్ నాయక్, లక్‌పతి నాయక్, నరేందర్, రాజేష్ తధితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త

### కాంట్రాక్టర్లతో జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి చర్చలు

**-బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని చెప్పడంతో ఆందోళన విరమణ**

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:**

పెండింగ్‌లో బకాయిలను చెల్లించాలంటూ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట బల్దియాకాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. వివిధ అభివృద్ధి పనులకోసం రావాల్సిన 1500కోట్ల మేర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాజాగా శనివారం వారితో జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి చర్చలు జరిపారు. చర్చల అనంతరం తాత్కాలికంగా ఆందోళన విరమిస్తున్న కాంట్రాక్టర్లు ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న రూ.1500కోట్లు బిల్లులను దశవారీగా చెల్లిస్తామని అమ్రపాలి వారికి హామీ ఇచ్చారు. కాగా ఈనెల 5వ తేదీలోగా బకాయిలను చెల్లించకుంటే జిహెచ్ఎంసి కాంట్రాక్టర్ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించడంతో అమ్రపాలి రంగంలోకి దిగి కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు.

### ఒ.యూ ఇంజనీరింగ్ కళాశాల అకాడమిక్ అవార్డుల ప్రధానోత్సవం

**-విద్యార్థులకు ఆవార్డులను అందజేసిన సింగరేణి ఎండి.బలరాం నాయక్**



**తార్నాక, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ ఇంజ నీరింగ్ కళాశాల అకాడమిక్ ఆవార్డుల ప్రధానోత్స వం శనివారం ఎంతో సందడిగా జరిగింది. ఈవేడుకకు ముఖ్య అతిథిలుగా సింగరేణి సీఎండీ బలరాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక తను ఆలవర్చుకొని ముందుకు సాగాలని సూచించారు. యువకులు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించి ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆవార్డుల ప్రధానోత్స వం సందర్భంగా వివిధ రంగాల్లో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన కళాశాల పూర్వ విద్యా ర్థిని ఎంపికజేసి విశిష్ట పూర్వ విద్యార్థి పూరస్కారాన్ని అమెరికాకు చెందిన కృష్ణ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వ్యవస్థాపకులు గోపాల టికె. కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు ఘనం గా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం నాయక్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, ప్రొ.పి. చంద్రశేఖర్‌తో కలసి విద్యార్థులకు ఆవార్డులు, సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రొ.నర్సింహులు, పూర్వ విద్యార్థుల అధ్యాపకులు డా. దేవరకొండ విజయ్ కుమార్, ప్రొ. కృష్ణయ్య,కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు పాల్గొన్నారు.



# వణికిస్తున్న డెంగీ

**-జిహెచ్ఎంసి, శివారు మున్సిపాలిటీల్లో టైగర్ దోమల స్వైరవిహారం**

**-పగటిపూట కుట్టే ఆ దోమలతో వ్యాపిస్తున్న జ్వరాలు**

**హైదరాబాద్,ఆగస్టు 3, భాతవార్త**

జిహెచ్ఎంసిలో ఎంటమాలజీ విభాగంలో 2,500 మంది సిబ్బంది ఉన్నారు. అదనపు, జోనల్, డిప్యూటీ, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కమిషనర్ ఆదేశించినా పట్టించుకునే వారు కరువయ్యారు. రసాయనాలు, యంత్రాలు, సిబ్బంది వేతనాల కోసం ఏటా రూ.15 కోట్లు ఎంటమాలజీ విభాగం ఖర్చు చేస్తోంది. అయినా నెల రోజుల్లో డెంగీ కేసుల సంఖ్య మూడింతలు పెరిగింది. అనధికారికంగా ఈ సంఖ్య మూడు, నాలుగింతలు అధికంగా ఉంటుంది.

విపరీతమైన జ్వరం. ఒళ్లునొప్పులు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం.. అడుగు తీసి అడుగు వేయలేనంతగా కీళ్లనొప్పులు!! రాష్ట్రంలో ఈ తరహా లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. వారికి పరీక్షలు చేయిస్తే.. చాలామందిలో డెంగీ, చికున్‌గున్యా నిర్ధారణ అవుతోంది. వారిలో కొంతమందిని ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స చేయాల్సి వస్తోందని వేద్యులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు 103-104 డిగ్రీల జ్వరంతో వస్తున్న ఔట్‌పేషెంట్లలో.. 90శాతం కేసులు డెంగీ, చికున్‌గున్యావే అయి ఉంటున్నాయని వారు వెల్లడిస్తున్నారు. వారిలోనూ డెంగూయ బాధితులే ఎక్కువగా ఉంటున్నారని.. మూడోవంతు కేసులు చికున్‌గున్యావి ఉంటున్నాయని వైద్యులు వివరించారు. అలాగే.. నిత్యం ఓపీకి వస్తున వారిలో కనీసం ఐదోవంతూ ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితి ఉంటోందని తెలిపారు. ఫీవర్ ఆస్పత్రిలో రోజూ 650కి పైగా ఓపీ కేసులు వస్తుండగా, అందులో 10 దాకా డెంగ్యూ లక్షణాలు ఉన్నవారేనని సమాచారం. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆస్పత్రిలో కూడా చాలా మంది డెంగ్యూ లక్షణాలతో వస్తున్నట్లు తెలుస్తోంది.

డెంగీ, చికున్‌గున్యా వ్యాపికి ఎడెస్ ఈజిప్టె అనే దోమ ముఖ్య కారణం. కానీ.. భారతదేశంలో దాని తర్వాత ఆ రెండు జ్వరాల వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్న మరో రకం దోమ ఎడెస్ ఆల్బోఫిక్టస్ అలియాస్ టైగర్ దోమ. ఇప్పుడు ఈ దోమలు రాష్ట్రవ్యాప్తంగా స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ దోమలపై పులుల మాదిరిగా చారికలు ఉండడంతో వీటికి ఆ పేరు వచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుండడంతో దీన్ని అర్బన్ మస్కిటోగా కూడా పిలుస్తారని వైద్యులు తెలిపారు. డెంగ్యూ రోగిని కుట్టిన టైగర్ దోమ ఆ తర్వాత ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే అతనికి కూడా డెంగీ వచ్చే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట నిద్రపోయేటప్పుడు దోమల కుడతాయనే భయంతో తెరలు, కాయిల్స్, దోమలు కుట్టకుండా ఒంటిపై రాసుకునే లేపనాలను వాడుతాం. కానీ ఈ టైగర్ దోమలు పగటిపూట కుడతాయని చీకటిపడ్డాక వీటి జాడ ఉండదని వైద్యులు చెబుతున్నారు.

టైగర్ దోమలు ఇంటి పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయి. మురుగు నీరు ఉండే చోట తన స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. ఉదాహరణకు ఎయిర్ కూలర్‌లో నిల్వ ఉండే నీటిలో, ఫ్లవర్ వాజులు, ఆక్వేరియం, పగిలిన సీసాలు, కుండపెంకుల్లో, వర్షపునీరు పడి నిలిచే చోట, మూతలులేని ట్యాంకుల్లో నివాసం ఏర్పరచుకుని అక్కడే గుడ్డు పెడుతూ తన సంతతిని పెంచుకుంటుంది. ఈ దోమలు రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించడం వల్ల చాలా మంది డెంగీ, చికున్‌గున్యా వంటివాటిబారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. కాబట్టి పగటిపూట కుట్టే ఈ దోమల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టుపక్కల ఎక్కడా నిల్వ నీరు, మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇటీవలికాలంలో చాలామంది 103-104 జ్వరం, నీళ్ల విరేచనాలు, ఒళ్లు కీళ్ల నొప్పుల వంటి లక్షణాలతో అస్పత్రికి వస్తున్నారు. అది సాధారణ వైరల్ ఫీవర్ అయితే రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. కానీ చాలా మంది జ్వరం రాగానే డెంగీ, చికున్‌గున్యా పరీక్షలు చేయించుకుంటున్నారు. కానీ.. అలా వెంటనే టెస్టులు చేయించుకోవడం వలన్ల ఉపయోగం లేదు. జ్వరం వచ్చిన ఐదురోజులకు శరీరంలో యాంటీబాడీస్ తయారవుతాయి. అప్పుడు పరీక్ష చేయిస్తే ఒకవేళ ఆ యాంటిబాడీస్ ఉంటే పాజిటివ్ వస్తుంది. ముందే పరీక్ష చేయిస్తే నెగెటివ్ వస్తుంది. దీంతో డెంగ్యూ లేదని భావించి నర్లక్ష్యంగా ఉంటారు. అదిసరికాదు అలాగే.. లక్షణాలు కనిపించిన అయిదు రోజుల వరకు యాంటిబయాటిక్ మందులు ఇవ్వకూడదు. లక్షణాలను బట్టి పారాసెటమాల్, ఫ్లూయిడ్స్ వంటివి ఇవ్వాలి. ఐదురోజుల తర్వాత టెస్ట్ చేయించి అది ఏ జ్వరమో నిర్ధారించుకోవాలి. డెంగీ వస్తే 6వ రోజుల నుంచి ప్లేట్‌లెట్స్ తగ్గడం మొదలవుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య 20 నుంచి 30వేల లోపునకు పడిపోతే అదనంగా ఇవ్వాల్సి ఉంటుంది.

## తహసీల్దార్ ఆఫీసుకు వచ్చే ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి

**-మీ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, భవనాలను గుర్తించండి**

**-ఆర్డీవో, ఎమ్మార్వోల సమీక్షా సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:**

సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయాలు వచ్చే ప్రతి దరఖాస్తును వచ్చినవి వచ్చినట్లే పరిష్కారం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ,వివిధ సెక్షన్స్ పర్యవేక్షకులతో నిర్వహించిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని వివిధ అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతిదరఖాస్తును ఇన్‌వార్డులో తేదీవారీగా నమోదు చేసి అదేరోజు సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని, సంబంధిత సెక్షన్లకు వచ్చిన దరఖాస్తులను వచ్చినవి వచ్చినట్లు పరిష్కారం కావాలని అదేశించారు. ప్రజాపాలన సేవాల కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, గ్యాస్, ఎలక్ట్రిసిటీ సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. సిఎంవో, ప్రజావాణి , మీసేవ దరఖాస్తులన్నీ వెనువెంటనే పరిష్కారం చేయాలని, మీసేవా డాష్‌బోర్డులో పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. అక్రమణకు గురైన ప్రభుత్వ భవనాలు, భూములను గుర్తించాలని అధికారులకు సూచించారు. అలాగే కళ్యాణలక్ష్మీ , షాదీముబారక్ దరఖాస్తులను యుద్ధ ప్రతిపదికన పరిష్కారం చేయాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వెంకటచారి తదితరులు

## నిమ్స్‌లో దొంగల బెడద..

**-సెల్ ఫోన్ చోరీ సీసీ కెమేరాలో రికార్డు**

**-తరచు సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోని సెక్యూరిటీ సిబ్బంది**

**పంజగుట్ట, ఆగస్టు 3 (ప్రభాతవార్త):**

నిమ్స్ ఆసుపత్రికి రోగులు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని తమకు వచ్చిన వ్యాధి నయం చేసుకోవడానికి ఉరుకులు, పరుగులు పెడుతుంటారు. రోగులు వారి హడావుడిలో వారు ఉండగా దొంగలు సందట్లో సడేమియా చందంగా తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఓపీ కౌంటర్‌ల వద్ద, రద్దీగా ఉండే రోగుల వద్ద కొంతమంది దొంగలు చేరి తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిమ్స ఓపీ విభాగంలో నెఫ్రాలజీ పేషెంట్ ఒకరు ఓపీ కౌంటర్‌లో తన పేరు నమోదు చేయించుకునే హడావుడిలో ఉండగా ఓ దొంగ తన చేతి వాటం ప్రదర్శించి పేషంట్ వద్ద ఉన్న ఐ ఫోన్‌ను దొంగిలించాడు. ఈ దృశ్యం సీసీ కెమరాలో రికార్డు అయింది. పేషంట్ నిమ్స్ సెక్యూరిటీ అధికారులను సంప్రదించగా సీసీ కెమరా రికార్డులనుపరిశీలించడంతో దొంగతనం చేసిన వ్యక్తి ఫోటో క్లియర్‌గా రికార్డు అయింది. దీంతో ఈ విషయమై పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

## విద్యార్థిని ఆత్మహత్య

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శ్రీప్రసన్న మహంకాళి దేవాలయం ఎదురుగా ఉన్న మారుతి హోమ్స్‌లో ఆర్టీసీ పికెట్ డిపోలో పనిచేసే రవీందర్ కూతురు లాలస చందన(18) అనే విద్యార్థిని వరంగల్ ఎన్ఐటి సీట్ కోసం ప్రయత్నిస్తోంది. కాగా శనివారం ఇంట్లోని గదిలో లాలస చందన తలుపులు వేసుకొని చాలాసేపటి నుంచి బయటకు రాలేదు. తల్లి చాలాసార్లు తలుపు కొట్టిన ఎటువంటి స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్ళింది. లోపట లాలస ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యం కనబడింది. వెంటనే ఆమె 100 నెంబరుకు డయల్ చేసి సమాచారం అందించింది. సమాచారం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## పాతకక్షలతో కార్మికుడిని హత్యచేశారని అనుమానాలు

**-జీడిమెట్ల దేవేందర్‌నగర్‌లో ముస్తఫా దారుణహత్య**

**-తనను జైలుకు పంపించాడనే కోపంతో హత్యకు పాల్పడినట్లు అనుమానం**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 ప్రభాతవార్త**

ఇద్దరు కార్మికుల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరు జైలుజీవితం అనుభవించగా అదిమనసులో పెట్టుకుని నాలుగు నెలల తరువాత హత్యచేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంనుండి 20ఏళ్లక్రితం నగరానికి వచ్చిన ముస్తఫా(38) గాజులరామారం దేవేందర్‌నగర్‌లో నివాసముంటూ రోజుకూలీ చేసుకుంటుండేవాడు. స్థానికంగా జేబుదొంగగా మారిన ముస్తఫాను పలుమార్లు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే శనివారం ముస్తఫా దారుణహత్యకు గురయ్యాడు. నగర శివారుజీడిమెట్ల పారిశ్రామికవాడలో దినసరి కూలీగా పనిచేస్తూ ఆయా కంపెనీల సమీపంలోనే నడుపుతుండే ముస్తఫాకు పదిహేనేళ్లక్రితం వివాహమై బార్యభర్తలమధ్య తలెత్తిన ఘర్షనలతో విడిపోయారు. స్థానికంగా నివసించే గౌస్ అనే కార్మికుడితో ముస్తఫాకు తరచూ ఘర్షనచోటుచేసుకుంటుండేది. 2019లో వీరిద్దరి మధ్య తలెత్తిన ఘర్షణతో కేసు నమోదుకావడంతోపాటు గౌస్‌కు జైలుశిక్ష పడింది. దీనితో అప్పట్లో గౌస్ జైలుజీవితం గడిపి నాలుగు నెలలక్రితం విడుదలైవచ్చాడు. తిరిగి వచ్చిన తరువాత సైతం వీరిద్దరిమధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకోవడం ఇదేతరుణంలో ముస్తఫా శనివారం హత్యకు గురైయ్యాడు. ఈ సమాచారం ముస్తఫా సోదరుడు తమస్సూర్ అలీ ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించిన పోలీసులకు ముస్తఫా గత చరిత్ర పరిశీలించగా గౌస్‌ను జైలుకు పంపిన విషయం బయటపడింది. అయితే హత్య గౌస్ చేశాడా లేదా అనేది బయటపడలేదు. ముస్తఫా హత్యకుగురి కావడంతో ఈపని గౌస్ చేసి వుంటాడనేకోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

## పాతబస్తీలో అక్రమ రేషన్ బియ్యం, గోధుములు పట్టివేత

**-అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్**

**చార్మినార్,ఆగస్టు 3 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీలో అక్రమంగా రేషన్ బియ్యంతో పాటు గోధుములు నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న గ్యాంగ్‌ను సౌత్ జోన్ టాస్క్ ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాతబస్తీలోని రెండు చోట్ల దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకీ తీసుకున్నారు. వారి వద్ద నుంచి 102 క్వింటాల రేషన్ బియ్యం,31 క్వింటాల గోధుమలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం....పాతబస్తీ నషేమాన్ నగర్‌కు చెందిన షేక్ రషీద్, షేక్ అయాజ్ తండ్రి కొడుకులు ఆమాన్‌నగర్‌కు చెందిన షేక్ సాబేర్‌తో పాటు మరో కొంత మందితో కలిసి రేషన్ బియ్యాన్ని కేజి 12 రూపాయలకు కొనుగోలు చేసి 20 రూపాయలు కేజి చొప్పున విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, భవానీ నగర్ పోలీసులు, సివిల్ సప్లయి అధికారులు కలిసి దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి రెండు లక్షల తొంభై వేల రూపాయలు విలువ గల 102 క్వింటాల రేషన్ బియ్యం,31 క్వింటాల గోధుమలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యంతో పాటు గోధువులు అమ్ముతున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకీ తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం భవానీనగర్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసును భవానీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.






# ఫారిన్ కిక్..!

**-నగరంలో పెరుగుతున్న విదేశీ మద్యం అమ్మకాలు -ఖరీదైనా... వెనకాడని మద్యం ప్రియులు**

**-పార్టీలు, బడాబాబుల ఫంక్షన్లలో వాడకం -ఒక్కో బాటిల్ ధర రూ.5వేల నుండి లక్ష వరకు..**

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:** స్వదేశంలో విదేశీ మద్యానికి రోజురోజుకూ క్రేజ్ పెరిగిపోతున్నది. మద్యపాన ప్రియులు ఎంత ఖర్చయినా వెనకాడటం లేదు. ఆకర్షనీయమైన డిస్‌ప్లే,ఎయిర్ కండీషన్ దుకాణాలను ప్రారంభిస్తూ మద్యం ప్రియులను ఆకట్టుకుంటున్నారు. వాటిని చూడగానే అందులోకి వెళ్ళాలన్న ఆసక్తి ఉన్నా..అక్కడి మద్యం ధరలు చూస్తే మాత్రం కళ్లు తిరుగుతున్నాయి. దేశీ మద్యంతో విసుగెత్తి పోయిన వారంతా తాజాగా విదేశీ మద్యం కోసం పరుగులు పెడుతున్నారు. జంటనగరాల్లో విదేశీ మద్యం అమ్మకాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. సంపన్న వర్గాలు అధికంగా నివసించే ప్రాంతాల్లో విదేశీ మద్యం దుకాణాలు పెద్దసంఖ్యలో వెలుస్తున్నాయి. సూపర్ మార్కెట్,షాపింగ్ మాల్స్ మాదిరిగా 'ఇంపోర్టెడ్ లిక్కర్ మాల్స్ వెలుస్తున్నాయి. ఒక్కో బాటిల్ రూ.5వేల నుండి లక్ష రూపాయల వరకు పలుకుతున్నాయి. నగరంలో ఖరీదైన కిక్కును కోరుకునే వారికే ఇవి అదుబాటులో ఉంటున్నాయి. సాధారణంగా దేశీయ మద్యం ధరలను పక్కన పెడితే విదేశీ మద్యం తాగకముందే కళ్లు తిరిగి పోతాయి. అయినా..విదేశీ మద్యం రుచి చూడాలనుకునే వారికి ఈధరలు పెద్దభారంగా కనిపించడం లేదు. అందుకే వీటికి మంచి క్రేజ్ పెరిగిందని విదేశీ మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యాపారులు తెలుపుతున్నారు.

### విదేశీ బ్రాండ్లకోసం పరుగులు..



రోజురోజుకూ నగరవాసుల్లో విదేశీ మద్యం పట్ల క్రేజ్ పెరుగుతుండటంతో వీటి షాపులు కూడా భారీ ఎత్తున హంగూ ఆర్భాటాలతో వెలుస్తున్నాయి. హైటెక్‌సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ , బంజారాహిల్స్ , సికింద్రాబాద్ ప్రాంతాల్లో విదేశీ మద్యం దుకాణాలు వెలిశాయి. ఇందులో అనేకరకాల బ్రాండ్‌లు కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. విదేశీ మద్యంలో జానీవాకకర్ ఎక్సో, జానీవాకర్, జానీవాకర్ ప్లెజర్, జానీవాకర్ బ్లూ, శివాస్‌లీగ్, జానీవాకర్ డబుల్ బ్లాక్, గ్లెన్‌లీవిట్, గ్లెన్‌ఫిడిక్, మేక్‌లాన్, బెయిలీస్, జానీవాకర్ గోల్డ్ లేబుల్, రాయల్ సెల్యూట్, డాన్ పెరి గ్నన్, చివాగ్ రీగల్, చివాగ్‌రీగల్ ఎక్స్‌ట్రా, రెడ్‌లేబుల్, డబుల్‌బ్లాక్, బ్లాక్ లేబుల్ వంటివి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటని కొనడానికి కేవలం ఆప్రాంతాల్లోని వారే కాకుండా శివారు ప్రాంతానికి చెందిన మందుబాబులు కూడా విదేశీ మద ్యం కోసం నగరానికి తరలుతున్నారంటే పరిస్థితి అర్థం చేసు కోవచ్చు.

### విదేశీ బీర్లకూ డిమాండ్..

విదేశీ బ్రాండ్లలో బీరుకుకూడా మంచి కేజ్రీ ఉంది. ఏకాలమైనా ఈబీర్లు అమ్మకాలు కొనసాగుతున్నాయి. దేశీయ బీర్లకంటే విదేశీ బీర్‌ల ధరలు రెట్టింపుగా ఉన్నాయి. ప్రస్తుతం దేశీంగా లభించే బ్రాండ్ల బీరు ధరలు రూ.150నుండి 200 వరకు ఉన్నాయి. కాగా విదేశీ బీర్లు మాత్రం రూ.300నుండి 400వరకు పలుకుతున్నాయి. నగరానికి స్పెయిన్, బెల్జియం, ఇంగ్లాండ్, మెక్సికో దేశాల నుండి అధికంగా దిగుమతి అవుతున్నాయి. వీటి ధరలు ఎంతయినా విదేశీ బ్రాండ్‌ను రుచి చూడాలనుకునే వారికి ధరలు అడ్డుకావడం లేదని వ్యాపారులు తెలుపుతున్నారు.

# అద్దెకు ఉంటూ ఇంటి యజమాని ఇంట్లోనే చోరీ..

**-వారం రోజుల్లోనే నిందితులను పట్టుకుని నగల స్వాధీనం**

**కొంపల్లి, ఆగస్ట్ 3, ప్రభాతవార్త**

అద్దెకు ఇంటోన్ల ఉంటూ ఇంటి యజమాని నగలతో పాటు నగదు దోచుకెళ్లిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న జి.వెంకట్‌రావు, వృత్తిపరంగా సివిల్ కాంట్రాక్టర్ రోజు మాదిరిగానే తేది:26.07.2024నాడు ఉదయం 08:30 గంటల ప్రాంతంలో తన ఇంటి నుండి పని నిమిత్తం బయటికి వెళ్లి తిరిగి అదేరోజు సమయం మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో తన ఇంటికి వచ్చి చూడగా తన ఇంటికి తాళం వేసి ఉండేను. వెంటనే అతని భార్య రాజ్యలక్ష్మికి ఫోన్ చేయగా ఆమె జర్నలిస్ట్ కాలనీ నందు చైతన్య కాలేజ్ సమీపంలో గల కిరాణాషాప్ నందు ఉన్నదని తెలపడంతో అతను వెంటనే తన భార్య వద్దకు వెళ్లి ఇంటి తాళం తీసుకొని ఇంటికి వచ్చి తాళం ఓపెన్ చేసి ఇంటి నందు ఉన్నాడు. సమయం 2 గంటల ప్రాంతంలో తన భార్య వాళ్ల ఇంటికి వచ్చింది. భార్య భర్తలు ఇద్దరు కలిసి వాళ్ల బెడ్‌రూమ్ నందు గల బీరువా తెరిచి చూడగా బీరఉవా నందు గల బంగారు వస్తువులు సుమారు 20 తులాలు, రూ.90వేల నగదు కనిపించలేదు. ఈ మేరకు వారు బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జె.ఉపేందర్ రావుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎస్‌హెచ్‌ఓ, డిఐ తిమ్మప్ప, క్రైమ్ టీమ్ విచారణలో భాగంగా అట్టి బంగారు



దొంగలించిన బంగారు నగలు

వస్తువులు, నగదు దొంగలించిన వ్యక్తుల కోసం వెతుకుతుండగా శనివారం బాచుపల్లి పోలీస్ వారు నేరస్థుల కోసం ప్రగతినగర్‌లో బంగారు షాపుల దగ్గర క్రైమ్ బీట్ నిర్వహిస్తుండగా ఉదయం 10 గంటల సమయంలో ఒక మహిళ, ఒక యువకుడు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఒక బ్యాగును పట్టుకొని రోడ్డుపై అటుఇటు తిరుగుతుండగా వారిపై అనుమానం వచ్చి వారిని పట్టుకొని బ్యాగు ను చెక్ చేయగా అందులో బంగారు వస్తువులను గురించి విచారిం చగా వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో వెంటనే పీఎస్‌కు తీసుకుని వచ్చి విచారించగా వారు ఇద్దరఉ కలిసి నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ నందు ఒక ఇంట్లో దొంగలించినట్లు తెలిపారు. నిందితులు జర్నలిస్ట్ కాలనీకి చెందిన బదుగు జ్యోతి (27), నిజాం పేట్ ఇంద్రమ్మ కాలనీకి చెందిన జంపని చైతన్య (22) ఇద్దరు దగ్గరి బంధువులు. కాగా గత 2 సంవత్సరాల నుండి మహిళా నేరస్థురా లు బదుగు జ్యోతి తన కుటుంబ సమ్మేతంగా ఫిర్యాదుదారుని ఇంట్లో అద్దెకు నివాసం ఉంటుంది. ఫిర్యాదుదారుని భార్యతో ఆమె స్నేహితంగా ఉండి ఫిర్యాదుదారుని ఇంట్లో బంగారం ఎక్కడ దాచి పెట్టి ఉంటుందో మొత్తం గమనించి తనకు వరసకు మరిది అయిన జంపని చైతన్యతో కలిసి ఫిర్యాదుదారుని ఇంట్లో బంగారు వస్తువుల ను దొంగలించి వాటిని అమ్ముకొని తనకు ఉన్న అప్పును తీర్చుకో వాలని నిర్ణయించుకొంది. ఆమె పథకం ప్రకారం గత 10 రోజుల క్రితం ఫిర్యాదుదారుని ఇంటికి సంబంధించిన తాళం చెవిని బటయ తయారు చేపించుకొని తన దగ్గర పెట్టుకుని తేదీ. 26.07.2024 ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవ్వరూ లేనిది గమనించి తన మరిది జంపని చైతన్యతో కలిసి పథకం ప్రకారం దొంగలించినట్లు తెలిపారు.

పోలీసువారు ఇద్దరు వ్యక్తుల వద్ద నుండి 20తులాల బంగారు వస్తువులను సీజ్ చేశారు. వాటి విలువ సుమారు 14లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. నేరస్తులను జుడిషియల్ రిమాండ్‌కు పంపామని బాచుపల్లి ఇన్స్‌పెక్టర్ జె.ఉపేం దర్‌రావు తెలిపారు. బాచుపల్లి పిఎస్, ఇన్స్‌పెక్టర్, డిఐ పర్యవేక్ష ణలో బాచుపల్లి క్రైమ్ టీమ్ అద్భుతమైనపని చేసినందుకు వారికి కూకట్ పల్లి డివిజన్ ఏసీపీ, బాలానగర్ డీసీపీలు ప్రశంసించారు.

## నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**-మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**అత్తాపూర్ ఆగస్టు3,ప్రభాతవార్త :** నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరుతూ శనివారం సచివాలయంలో వ్యవసా య,మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వర రావును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కలిసి వినతిప త్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నియో జకవర్గంలోని పలు అభివృద్ధి పనుల కు ప్రత్యేక నిధులను కేటాయించామ ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కోరడం జరిగిందని తెలిపారు.మంత్రి సానుకులంగా స్పందించి తప్పకుండా నిధులు మంజూరుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టాలి

**-17న చేవేళ్లలో మహాధర్నాకు బిజెపి ఎస్సీమోర్చ పిలుపు**



బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయా లని బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర పదాధికా రులు, జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్ణ యించింది. శనివారం బర్కత్‌పురంలోని బిజెపి నగర కార్యాలయంలో ఎస్సీ మో ర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర ప్రభారి డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌లో సుమారు రూ.3,500 కోట్లు కోత విధించడం జరిగిందని, ఎన్నికలకుముందు ఎస్సీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు (అంబేడ్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పున: నిర్మాణం తదితర అంశాలు' ఎటువంటి కేటాయింపులు జరగలేదని సమావేశం ఆవేదన వ్యక్తంచేసింది. రాబోయే రోజుల్లోకాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భవిష్యత్తుకార్యక్రమాలపై చర్చించి నిర్ణయించాలని తీర్మానించింది. ఆగస్టు 5,6,7 తేదీల్లో ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులుచేయాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రంలోని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన, ఆగస్టు 17న కాంగ్రెస్ పార్టీ చేవేళ్ళ ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయిం చడంలో విఫలమైనందుకు చేవేళ్ళలో ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టాలని నిర్ణయించింది. సమావేశంలో ఎస్సీ మోర్చరాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆత్మకూరి కాంతికిరణ్, కుమ్మరి శంకర్, ఎన్. మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం తగదు : ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, ఆగష్టు 3, ప్రభాతవార్త**

సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. శనివారం యూసుఫ్‌నగర్, సబ్దార్‌నగర్, రాజీవ్ గాంధీనగర్‌లో స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలు సమస్యలతో అల్లాడిపోతున్నారని అధికారులు మాత్రం పట్టిం చుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.యూసుఫ్‌నగర్, సబ్దార్‌నగర్‌లో డ్రైనేజి పొంగి పొర్లడంతో పాటు రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రాజీవ్‌గాంధీనగర్‌లో వర్షాలు వచ్చినపుడు వర్షపు నీరు ఇళ్ళల్లోకి చేరడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతనంగా చెరువు పక్కన కట్ట నిర్మించడంతో ఇళ్ళకు చెరువు కట్టకు మధ్యలో రహదారి ఏర్పాటు కోసం స్థలం వదలాలని అధికారులకు సూచించారు.పైప్‌లైన్ నిర్మాణంతో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.అధికారులు పనులకు స్థానికులు అడ్డుపడరాదని లింకు రోడ్డు నిర్మాణం కోసం స్థలం వదిలి పైప్‌లైన్ నిర్మాణం పూర్తిచేయాలని అన్నారు.రాజీవ్‌గాంధీనగర్, సబ్దార్‌నగర్‌లలో విద్యుత్ స్థంభాలను ఏర్పాటుచేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అద్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అద్యక్షులు లింగాల ఆయిలయ్య, ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ, డివిజన్ కోఆర్డినే టర్ వీరారెడ్డి, దుర్గ, ఏ బ్లాక్ అద్యక్షులు కొమ్ముల రమేష్, కొండం సంపత్‌రెడ్డి, సయ్యద్ రియాజ్, హమీద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఈస్ట్ మారేడ్‌పల్లిలో బోనాలు

**కంటోన్మెంట్,ఆగస్టు 3 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజ కవర్గం ఈస్ట్ మారేడ్‌పల్లి, వడ్డెర బస్తీలోని శ్రీ రేణుక ఎల్ల మ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు, పలహార బండి ఊరేగింపులు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, ఆలయ చైర్మన్ దండుగుల వెంకటస్వామి, కార్యదర్శి డి.మో హన్‌లు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడు తూ గత 25 ఏసంవత్సరాల నుంచి ఈస్ట్ మారేడ్‌పల్లిలో బారీ ఎత్తున బోనాల వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం బోనాలు, సాయంత్రం రేణుక ఎల్లమ్మ దేవాలయం నుంచి షెనాయ్ నర్సింగ్ హోం, టీచర్స్ కాలనీ, ఈఎస్ట్ మారేడ్‌పల్లి, అంబేడ్కర్ నగర్‌ల మీదుగా పలహార బండి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అదే విధం గా ఈ నెల 5న సోమవారం వడ్డె బస్తీ, అడ్డగుట్ట, రియో పాయింట్, తుకారాంగేట్ వరకు పలహార బండి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. పరిసర ప్రాంతాల్లో విద్యు త్ దీపాలతో స్వాగత వేదికలు ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాలన్నీ శోభాణమయంగా మారాయి.

**రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో . . .**

కంటోన్మెంట్ మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబే ద్కర్ నగర్‌లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ అధ్యక్ష,కార్యదర్శు లు మేకల చంద్రశేఖర్, నరి స్ంగ్‌రావ్, ఆలయ వ్యవస్థాప కులు బి.బాలమల్లు యాదవ్‌లు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ బోనాల వేడుకలకు కంటోన్మెం ట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బిఆర్ఎస్ నాయకులు నివేదిత, గజ్జెల నాగేశ్, మన్నె క్రిషాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు రౌతు రాజయ్య, బి.నారా యణ,చిన్న వీరయ్య, యేసు రత్నం, పరశరాములు, పంగ రాజయ్య, డి.బాబురావ్‌లు పాల్గొన్నారు.

## వృత్తి విద్యాంశాలపై అనుసంధాన సదస్సు

**-ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు**



సదస్సులో విదేశీయూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న విద్యార్థులు

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:** విద్యార్థుల సామర్థ్యాలపైన సంపూర్ణమైన అవగా హన కల్పిస్తూ విజయవంతమైన భవిష్యత్ నిర్మాణం కోసం విదేశీ యూనివర్సిటీలతో అనుసంధాన సదస్సును నిర్వహించినట్లు గ్లోబల్‌ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ ఆలపాటి అన్నారు. శనివారం సోమాజిగూడలోని విల్లామేరీ ఉమెన్ డిగ్రీకాలేజీ వేదికగా గ్లోబల్‌ట్రీ, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్ని -యూకే సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఐఎస్ఏయూ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థుల ఉపాధి, యూకే విద్యాలయ అవకాశాలపై అవగాహన కల్పించారు. దీనికి, ఎన్ఐఎస్ఏయూ చైర్‌పర్సన్ సనం అరోరా, విల్లా మేరీ కాలేజీ ప్రిన్సిపల్ రేవతి మాతూర్ ,హర్పర్ ఆడమ్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్యానెల్ డిష్కషన్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలపైన సంపూర్ణమైన అవగాహన కల్పిస్తూ విజయవం తమైన భవిష్యత్ నిర్మాణం కోసం నిపుణుల సూచనలతో ఈకార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు అంతర్జాతీయ సంస్థలతో విద్యాపరంగా విశ్వ విద్యాలయాలను అనుసంధానం చేయడానికి ఆసక్తిగా ఉన్నామని అన్నారు. ఇందులో భాగంగా యూకే, లండన్‌లోని పూర్వవిద్యార్థులతో మాట్లాడటం, వీసా ప్రక్రియలు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకోవడం వంటి అంశాలను కల్పించామన్నారు. సనమ్ అరోరా మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలకు అవకాశాల వేదికగా ఈఈవెంట్‌ను రూపొందిం చామని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సమాచార సెషన్, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, పరిశ్రమ నిపుణుల నుంచి మార్గదర్శకత్వాలను అందించడం వంటి కార్య క్రమాలు జరిగాయాని పేర్కొన్నారు.

## చట్టసభల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించాలి

**-అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు**

**చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** చట్టసభల్లో వికలాంగులకు రాజకీ య రిజర్వేషన్‌లు కల్పించాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్‌చేశారు. శనివా రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడోపుటిన్టన ఆంగ్లో ఇండియన్‌లకు పార్లమెంట్‌లో నామినేట్ చేస్తున్నారని, కాని ఇక్క డ పుట్టి, ఇక్కడ పెరిగిన వికలాంగులకు ఎందుకు చట్టసభకు నామినే ట్‌చేయడం లేదని ప్రశ్నించారు. రాబోయే కాలంలో రాజ్యాధికారం కోసం అందరు ఐకమత్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ము ఖ్యఅతిథిగా వికలాంగుల కార్పొరేషన్ పూర్వ చైర్మన్ పిన్నమనేని సాయి బాబా మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్‌లపై ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. ఫిలిం ఛాంబర్ కార్యదర్శి ముత్యాల రామదాసు మాట్లాడుతూ ఉన్నత విద్యలు చదివిని వారే దివ్యాంగులను కించపర్చడం సిగ్గుచేటని, వారు మనోధైర్యాన్ని నిం పాలన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్ గౌడ్, వేదిక నాయకులు పంది శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, వెంకటే శ్, లక్ష్మి, శంకర్, శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మెరిడియన్ రెస్టారెంట్‌లో బిర్యానీలో బొద్దింక..

**పంజగుట్ట, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

పంజగుట్టలో ఓ రెస్టారెంట్‌లో బొద్దింక రావడంతో కస్టమర్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంజగుట్టలోని మెరిడియన్ రెస్టారెంట్‌లో బిర్యానీ ఫేమస్ అని అందరూ ఎగబడుతుంటారు. ఇక్కడకు వచ్చి తినేవారే కాక స్విగ్గీ,జమాటా ఆర్డర్స్ కూడా విపరీతంగా ఇక్కడ నుండి తీసుకువెళుతుంటారు.శనివారం కొందరు యువకులు ఇక్కడకు బిర్యానీ తినడానికి వచ్చారు. బిర్యానీ సగం తిన్న తర్వాత చికెన్‌లో కలిసి బొద్దింక ఉండడాన్ని గమనించారు. వెంటనే ఈ విష యమై రెస్టారెంట్ యాజమాన్యం వారిని నిలదీయగా వారు లైట్ తీసుకున్నారు. ఈ విషయంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు అక్కడి కస్టమర్‌లు పలువురు తెలిపారు. కాగా పంజ గుట్టలలో ఇటీవల కాలంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పెదనద ఎత్తున తనిఖీలు చేస్తున్నా రెస్టారెంట్‌ల యాజమాన్యాల వైఖరిలో మార్పు కానరావడంలేదు. ఫుడ్ తయారు చేయడంలోనూ, నిల్వ ఉంచడం లోనూ నిర్లక్ష్యంగా ఉండడంతో పాటు రోజుల తరబడి డీ ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నా మని చెప్ప ఆ కాసేపు హడావుడి చేసి తర్వాత పటిన్టంచుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించే రెస్టారెంట్‌లపై కఠిన చర్యలు తీసు కోవడమే కాక భారీ జరిమానాలు, సీజ్ చేయడం లాంటి చర్యలు చేపడితే తప్ప వీరిలో మార్పు రాదని అక్కడ గుమికూడిన పలువురు కస్టమర్‌లు వ్యాఖ్యానించారు.

## మహిళా సాధికారితకు పభుత్వాలు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలి

**-మహిళలకు చట్టాలు రూపొందించే సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి**

**-మహిళలు మాతృమూర్తులే కాదు..**

**సాక్షాత్ బిడ్డకు జన్మనిచ్చే శక్తిస్వరూపులు**

**-జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి**



మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి

**గుమ్మడిదల, ఆగస్టు3 ప్రభాతవార్త:**

మహిళా సాధికారిత మరింత పటిష్టతకు ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిం చాలని, మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు చట్టాలను రూపొందించే అత్యున్నత సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలు మాతృ మూర్తులే కాదు.. సాక్షాత్ బిడ్డకు జన్మనిచ్చే శక్తిస్వరూపులని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి అన్నారు. శనివారం మిషన్ శక్తి వంద రోజుల అవగా హన కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేం ద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల స్పెషల్ కార్యనరకమంలో భాగంగా గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారితో పాటు డీఎల్పీవో అమృత, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, తహశీల్దార్ గంగాభవాని, ఎస్ఐ మహేశ్వ ర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలు అంటే అబల కాదు.. సబల అని, మహిళల పట్ల చిన్నచూపు చూడ రాదని, మహిళలు దేనిలో కూడా తక్కువ కాదని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ అమ్మయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాత పెళ్లి చేయాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సా హం అందించినప్పటికీ అక్కడక్కన అనివార్య కారణాల వల్ల అనుకోని ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, అటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా మహిళల కు అత్యున్నత చట్ట సభల్లో చట్టాలు రూపొందించే అవకాశం కల్పించాలన్నారు. మహిళలంటే కేవలం పిల్లలు కనే యంత్రాలు కాదని, మహిళలను పురుషులతో సమానంగా చూడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ పుడితే ఒక రకంగా, మగబిడ్డ పుడితే మరో రకంగా చూసే తల్లిదండ్రులకు ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలంతా అవగాహన కల్పించాలని సూచించారు.

**తల్లిపాల వారోత్సవాలు...**

తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతువేదికలో మహిళా సాధికారిత అవగాహన సదస్సు కార్యనరకమంలో మహిళ లకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు నూతనంగా వచ్చిన పటాన్‌చె రు ప్రాజెక్టు అధికారి సీడీపీవో జైరామ్ నాయక్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, అంగన్వాడీ సూపర్‌వైజర్ కవిత, మండలంలోని 13 పంచాయితీల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు హాజరై మహిళలకు తల్లిపాలు పిల్లలు పుట్టిన గంట సేపటికి ముర్రుపాలను అందించడంతో పౌష్టిక, రోగనిరోధక శక్తి కలిగినటు వంటి పాల గురించి మహిళా మాతృమూర్తులకు సవివరంగా వివరించారు. పుట్టి న ప్రతి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప వేరే ఎలాంటి డబ్బా పాలను వాడరాదని సూచించారు. అనంతరం వివిధ గ్రామాల చిన్నారులకు బాలామృ తంతో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీ ఎం శివకుమార్, డిస్టిక్ చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ గడ్డం పల్లవి, ఎంపీవో దయా కర్‌రావు, మండల సమైఖ్య సంఘాల అ ధ్యక్షురాలు అనురాధ, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, వివిధ గ్రామాల మహిళా సంఘాల నాయకులు, మహి ళలు, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం : ఎమ్మెల్యే దానం నాగేందర్

**పంజగుట్ట, ఆగస్టు 3 (ప్రభాతవార్త):**

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతున్నదని ఖైరతా బాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.శనివారం సోమాజీగూడ డివిజన్‌లో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుండి రిలీజ్ అయిన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం పేదవారికి అండగా ఉండడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెను వెంటనే నిధులు విడుదల చేస్తున్నారన్నారు.గతంలో కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతోమంది ప్రాణాలు కాపాడిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుందన్నారు.ఖైరతాబాద్ నియోజకవర్గంలో అర్హులైన పేదవారికి సంక్షేమ ఫలాలతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తినపుడు ప్రభుత్వం ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపా రు. కార్యక్రమంలో భాగంగా మహ్మద్ అఫ్సర్‌కు 60000,మహ్మద్ కలీమ్‌కు 54000,జ్ఞానేశ్వర్‌కు 60000, అఫ్జల్‌ఖాన్‌కు 60000 రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస యాదవ్ తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సిఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగం : ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగప డుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ కింద రామ్‌నగర్ డివిజన్‌కు చెందిన ఇరవై నాలుగు మంది లబ్దిదారులకు రూ.8.46లక్షల చెక్కులను అర్హులైన లబ్దిదారులకు అందించిన అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే వేలాది కుటుంబాలను సిఎం సహాయ నిధి ద్వారా ఆదుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సిఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తులు చేసుకున్నవారందరికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బిఆర్ఎస్ మీడియా ఇంచార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్, సీనియర్ నేతలు సుధాకర్‌గుప్త, ముదిగొండ మురళీ, శివకుమార్‌యాదవ్, నాయకులు బలవంత్‌రాజన, మున్నా, శ్రీకాంత్, రమేశ్‌రెడ్డి, గుండు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## అతివేగంతో కారు బోల్తా ...తప్పిన ప్రమాదం

**ఉప్పల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** నాగోల్ నుంచి హబ్సిగూడ రహదారిలో శనివారం ఉదయం కారు డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా కారు బోల్లాపడింది. దీంతో అందులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం నాగోల్ రహదారిలో పిల్లర్ నెంబర్ 854 వద్ద శనివారం ఉదయం 4.30 గంటల సమయంలో వేగంగా వస్తున్న టిఎస్ 07 హెచ్‌టి 9117 నెంబర్ కారు బోల్తాపడింది. దీంతో తోటి ప్రయా ణికులు గమనించి అందులో ఉన్న వారిని రక్షించారు. డ్రైవర్ అతివే గం, నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపా రు. కారు సడన్ బ్రేక్ వేయడం వల్లే ఈ సంఘటన జరిగిందని పోలీ సులు తెలిపారు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రిలో చికిత్స నిర్వహిం చారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూం వద్ద ఆందోళన

**బేగంపేట ఆగస్టు 3,ప్రభాతవార్త**

ఓలా హటావో ,జాన్ బాచావో అంటూ నినాదాలు చేస్తూ బేగంపేట లోని ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూం ముందు బైక్ వినియోగదారులు (బాధితులు) శనివారం ఆందోళణ చేసారు.ఈ బైక్ వాడకం ద్వారా అనేక ఇబ్బందులు ఉన్నాయంటూ వారు ఆరోపించారు.ఓలా బైక్ కొనవద్దు.ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు అంటూ వారు ప్రజలకు విజ్ఞప్తి చేసారు.ఈశ్వర్ అనే బైక్ వినియోగదారుడు మాట్లాడుతూ బైక్ రన్నింగ్‌లో సస్పెన్షన్ రాడ్డు విరిగిపోయి తన కుమారుడు తీవ్ర గాయాల పాలయ్యాడని,తృటిలో ప్రాణాలతో బైట పడ్డాడని తెలిపా రు.ఈ విషయాన్ని తాము షోరూం యజమాన్యం దృష్టికి తీసుకు పోగా హాస్పటల్ ఖర్చులు భరించడంతో పాటు కొత్త బైక్ ను ఇస్తా మంటూ హామీ ఇచ్చారని,నెలలు గడుస్తున్నా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని,అందుకే నిరసన కార్యక్రమం చేపట్టామన్నా రు.మరికొంత మంది వినియోగదారులు సైతం ఈ బైక్ వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్వీసింగ్ చేయడానికి కూడా చాలా రోజల సమయం తీసుకుంటున్నారని,చివరకు స్పేర్‌పార్ట్స్ సర్వీసింగ్ చేయకుండానే ఇస్తున్నారని ఇప్పటికైనా యాజమాన్యం తమకు న్యాయం చేయాలంటూ వారు డిమాండ్ చేసారు.

# ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణామాఫీ చేయాలి

**-మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణామాఫీ చేస్తామని చెప్పి అధికా రంలోకి వచ్చాక రైతులకు ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని నారాయణ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. గత 15 రోజుల నుంచి రైతులకు రుణమాఫీ లక్ష వరకు, రూ.1.50 లక్షల వరకు మాఫీ చేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నా చాలా మందికి రుణమాఫీ రాలేదని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రైతుకు రుణ మాఫీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సంబురాలు జరుపుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా భూములు ఉన్న వారికి రుణమాఫీ వర్తించడం లేదని, రేషన్‌కార్డులను జోడించడం సరికాదని అన్నారు. రుణమాఫీ కాని వారికి పెట్టుబడి సాయం కింద రైతులకు రుణాలు అందిం చాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీలు మహిపా ల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్, నారాయణఖేడ్ మండల తాజా మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, నారాయణఖేడ్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు నిజాంపేట తాజా మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌చారి,నారాయణఖేడ్ మాజీ సర్పంచ్ నజీబ్, మాజీ ఎంపీటీసీ ముజమిల్, నారాయణఖేడ్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నగేష్, నాయకులు అభిషేక్ శెట్కార్, రైతులు తదిత రులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

**-మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితవెంకన్న

**హుస్నాబాద్,ఆగస్టు3,ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు హుస్నాబాద్ మున్సిపాలిటీలో చేపట్టనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు.శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించబోయో కార్యక్రమంపై పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 5నుండి 9తేదీల వరకు ప్రతీ వార్డులో పారిశుధ్యం, సీజనల్ వ్యాదులు,త్రాగునీటితో పాటు నిల్వ ఉండే నీరు,ఇంకుడు గుంతల నిర్మా ణం,రోడ్లపై గుంతలు,వీధి కుక్కలు,మొక్కలు నాటడం వంటి అంశాలపై వార్డు ఆఫీసర్లు,మెప్మ రిసోర్స్ పర్సన్స్,అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కమి షనర్ మల్లిఖార్జున్‌గౌడ్,కౌనిలర్లు కొంకటి నళినిరవి,బోజు రమాదేవి రవిందర్, స్వర్ణలత,పద్మ,సరోజన,హరీష్,శ్రీలత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం,పచ్చధనం కార్యక్రమంలో మండలాన్ని పరిశుభ్రం గా తయారు చేసుకోవాలని అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ అధికారి బానోతు జయరాంనాయక్ పిలుపునిచ్చారు.శనివారం మండల కేంద్రంలోని తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న సమస్యలన్ని ఈ కార్యక్ర మం ద్వార పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.ప్రజలందరూ ఈ కార్యక్ర మంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు తదితరులు ఉన్నారు.

## రాజీవ్ స్వగృహా భవనాలను సందర్శించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు..



రాజీవ్ స్వగృహా భవనాలను సందర్శిస్తున్న సిడిఎంఎ డైరెక్టర్, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తాలు..

**జవహర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిర్మించిన రాజీవ్ స్వగృహా, నర్సరీ, డంపింగ్ యార్డులో నిర్మించిన పవర్ ప్లాంట్లను మున్సిపల్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ స్వగృహా భవనాలను అర్హులవకు మాత్రమే అందించాలన్నారు. మోసపూరిత చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్, కార్పొరేటర్లు కుతాడి సాయికుమార్, నాయకులు బల్లి శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి... ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



విద్యార్థికి బ్యాడ్జి కడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, శాంతి శేఖర్

**నాచారం, ఆగస్టు 3 ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం నాచారంలోని ఇందిరా హైస్కూల్‌లో ఘనంగా విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకార వేడుకను నిర్వహించారు. ఈ వేడుకకు కార్పొరేటర్ శాంతిశేఖర్, నాచారం ఇన్స్‌పెక్టర్ రుద్వీర్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే బిఎల్ఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో చదువు కోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, డ్యాన్సులు అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్న స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బ్యాడ్జెస్ కట్టి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాచారం ఎస్సై మైబెల్లి, డైరెక్టర్ అన్వర్ మోహినుద్దీన్, ఆఫ్సర్ మోహినుద్దీన్, ప్రిన్సిపల్ షెహనాజ్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ అయేష, పీఈటీ శేఖర్‌తో పాటు టీచర్లు, పేరెంట్స్ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## బస్తీలలో కనీస సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత: కార్పొరేటర్ శ్వేత



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని బస్తీలలో కనీస సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. చింతల్ బస్తీలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీలలో రోడ్లు, వీధి దీపాలు, త్రాగునీరు, పారిశుధ్యం వంటి కనీస సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, స్థానికులు రఘుపతి, కృష్ణ, మహేష్, సోమల, రేణుక, భారతి, వెంకటేష్, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాహితి కళాశాలలో ఘనంగా బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థులు

**వనస్థలిపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త :** బి.యన్‌రెడ్డినగర్‌లోని సాహితి మహిళా కళాశాలలో బోనాల ఉత్సవాలను శనివారం ఘనంగా జరిపారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి బోనాలను తీర్చిదిద్ది ఆటపాటలతోపాటు పోతరాజుల విన్యాసాలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల పండుగ అద్దం పడుతుందన్నారు. కళాశాలలో విద్యార్థులకు మన పండుగల ప్రాముఖ్యతను వివరిస్తూ వేడుకలను నిర్వహిస్తామన్నారు. మన ఆచార సాంప్రదాయాలను భవిష్యత్‌తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రామ్‌రెడ్డి, డైరెక్టర్ విగ్నేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్యం మధుర జ్ఞాపకం: ప్రిన్సిపాల్ బాబ్జి



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లులతో ప్రిన్సిపాల్ బాబ్జి, ఉపాధ్యాయులు

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** బాల్యం మధురజ్ఞాపకమని ఆ బాల్యాన్ని విద్యార్థులు సంతోషంగా గడపడానికి నారాయణ విద్యా సంస్థలు ప్రోత్సహిస్తున్నాయని మీర్‌పేట్ బ్రాంచి నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జీ అన్నారు. శనివారం పాఠశాలలో వినూత్నంగా పేరెంట్స్, ఛైల్డ్ ట్విన్నింగ్‌డ్రెస్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఒకే తరహాలో రంగు రంగుల దుస్తులు ధరించి పోటీల్లో పాల్గొని అలరించారు. ఈ సందర్భంగా పురస్కరించుకొని ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నూతనోత్తేజం వెల్లివిరుస్తుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలైన తల్లిదండ్రులను నారాయణ ఎజిఎం రవీంద్రబాబు అభినందించారు. కార్యక్రమంలో ఎఒ మాధవి, ఎడి రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : డిసి వెంకన్న



అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న జడ్‌సి వెంకన్న

**మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త :** గ్రేటర్ పరిధిలో వృక్ష సంపదను పెంచేందుకు ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీ హెచ్ యంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చాంద్రాయణగుట్ట సర్కిల్ ఫూల్‌బాగ్ జోనల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 5రోజులపాటు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్ర మానికి సర్కిల్ డిసిల పర్యవేక్షణలో ఆరోగ్యం పారిశుద్ధ్యం, యుసిడి, అర్బన్ బయోడైవర్సిటీ, టాక్స్, ఎంటమాలజీ విభాగాల సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుతోపాటు 5వ తేదీన పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి బస్తీలు, కాలనీ, వాణిజ్య సముదాయాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్స్, స్మశాన వాటికలు, పార్కులో ప్లే గ్రౌండ్లలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. 6న దోమల కట్టడికి, ఫాగింగ్, వీధికుక్కల బెడద నివారణ చర్యలు, 7న నీటి నిల్వలు, చెరువులు బావులు పరిశుభ్రత, 8న డ్రైనేజీ, నాలాల పూడిక తీత పనులు, కమ్యూనిటీ హాళ్ల నిర్వహణ పై కార్యక్రమం ఉంటుందన్నారు. చివరిరోజు 9న వనమహోత్సవం సందర్భంగా అన్ని బస్తీలు కాలనీలో, విద్యా సంస్థలు, ఇతర ప్రాంతాల్లో మొక్కలను పంపిణీ చేసి... ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నామని ఈ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నాం: లార్డ్స్ బీరప్ప



విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించిన లార్డ్స్ బీరప్ప

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** లార్డ్స్ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నామని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్, కార్పొరేటర్ సిద్దాల చిన్న బీరప్ప అన్నారు. జిల్లెలగూడ బ్రాంచి పాఠశాలలో శనివారం స్కూల్ కౌన్సిల్ క్రౌనింగ్ సెర్మనీని ఘనంగా నిర్వహించారు. భవిష్యత్తు సమాజంలో మేటి నాయకులను తయారు చేయడానికి ప్రత్యేకంగా నిర్వహించిన విద్యార్థి ఎన్నికల్లో విజయం సాధించిన వారితో ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మంచి నాయకత్వ లక్షణాలు అలవాటు కావాలనే సదుద్దేశ్యంతో విద్యార్థి ఎన్నికలను ప్రోత్సహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ మరియన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యధాతథంగా ఉంచాలి : అమరవాది లక్ష్మినారాయణ

**మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త :** తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యధాతథంగా ఉంచాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదని తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మ బలిదానం చేసుకుని రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేసారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యుడని ఆ మహనీయుని జ్ఞాపకార్థం తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుని గౌరవించుకుంటున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుకు బదులు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలని భావించడం సరైంది కాదని పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## చార్మినార్ సిడిపిఓగా పావని బాధ్యతలు

**సైదాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** చార్మినార్ సిడిపిఓగా పి.పావని శనివారం బాధ్యతలు స్వీరించారు. అనంతరం ఐఎస్ సదన్ డివిజన్ సాయినగర్‌లోని అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి నిర్వాహణను పరిశీలించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పావని మాట్లాడుతూ తన పరిధిలోని అంగన్‌వాడి సెంటర్లను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారులు, గర్భిణిలు, బాలింతలు తప్పని సరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కో ఆర్డినేటర్ ఎన్.శైలజ, టీచర్ పద్మిని, హెల్పర్ సక్కు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం : డిసిసిబి చైర్మన్ సత్తయ్య

**తుర్కయాంజల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య అధ్యక్షతన శనివారం సంఘ ప్రధాన కార్యాలయములో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన సభ్యులుగా 50 మందిని చేర్చుకోవడం జరిగిందని తెలిపారు. సంఘ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మే 1వ తేదీ నుండి జూలై 21 వరకు జమ ఖర్చులు ఆమోదించారు. 18 మంది రైతులకు 1కోటి 39 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేయడం జరిగిదన్నారు. సంఘ సభ్యులసంక్షేమం కొరకు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని అమోదించారు. ఈ కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సంఘ డైరెక్టర్లు, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతడి నర్సింగరావు, వంగేటి లక్ష్మ రెడ్డి, కొండ్రు స్వప్న,చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణ రెడ్డి, సామ సత్య నారాయణ రెడ్డి, మరియు సంఘ సెక్రెటరీ వై.రాందాస్ పాల్గొన్నారు.

## దేవాలయ ఆవరణలో ఫ్లోరింగ్ పనులు

**సైదాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** బోనాల పండుగను పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్ సాయిరాం నగర్ కాలనీలోని బంగారు మైసమ్మ దేవాలయ ఆవరణలో చేపడుతున్న ఫ్లోరింగ్ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శ్రావణ మాసంలో బోనాల పండుగను నిర్వహించే అమ్మవారి దేవాలయాల వద్ద తగిన మరమ్మత్తు పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండాలి

**తుర్కయాంజల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాలని విద్యుత్ శాఖ ఎస్సీ కరుణాకర్‌బాబు అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని ఇబ్రహీంపట్నం విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికై వినియోగదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ యాదగిరి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్ జలమోద్‌రెడ్డి, ఎం.రమేష్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ఈటలకు ఆహ్వానం



ఎంపి ఈటలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటి నేతలు

**ఉప్పల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి తగు ఏర్పాట్లు చేస్తున్నామని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సర్కిల్ పరిధిలో బోనాల ఉత్సవాలకు మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ నల్ల పోచమ్మ ఆలయ కమిటి నేత నల్ల వీరారెడ్డి, నల్ల రాజిరెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మార్నెని ఫణీందర్ తదితరులు పాల్గొని ఆహ్వాన పత్రిక అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పల్‌లో 4వ తేదిన నల్ల పోచమ్మ బోనాలు నిర్వహిస్తున్నామని, 8వ తేదిన మహంకాళి బోనాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## కేరళ వరద భాదితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న సీపీఐ నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** అకాల వర్షాలు, వరదలతో కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంత ప్రజలు వందలాదిగా మృతిచెందారని వేలసంఖ్యలో నిరాశ్రయులయ్యారని వారిని ఆదుకోవాలని కోరుతూ సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ... వరద బాధితుల సహాయార్థం మానవత్వం కలిగిన ప్రతిఒక్కరు తోచిన విధంగా ధన, వస్తురూపేన సహాయం అందించాలని కోరారు. విరాళాలను వెంటనే బాధితులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సహాయ కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, యేశాల నర్సింహ, నాగవల్లి యాదగిరి, పి.సైదులు, దూపం నిరంజన్, కామిల్ల చందన, తైలిమధు, బిచ్చునాయక్, లక్ష్మి, ప్రియ పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయాలి : చైర్ పర్సన్ అనురాధరాంరెడ్డి



అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ అనురాధ తదితరులు

**తుర్కయాంజల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాగన్నగూడ వార్డు కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడుతూ, ఈ నెల 5 నుండి 9 వరకు స్వచ్ఛదనం వచ్ఛదనం కార్యక్రమం తుర్కయంజాల్ మున్సిపాలిటీ 24 వార్డులలో ప్రారంభిస్తునట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత మరియు పచ్చదనం నిర్ధారించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడుతుందన్నారు. స్థానిక నాయకులు, ఇఎన్‌సి యూత్ సభ్యులతో సమావేశాలు, వీధి కుక్కల బెడద, సీజనల్ వ్యాధులపై క్యాంపియన్, పాఠశాలలో పారిశుధ్యం, ప్లాస్టిక్ వాడటంవలన దుష్పరిణామం, వీధులు మరియు బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం సాయంత్రం 4గంటలకు అన్నీ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమలలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## మెగాసిటీ హైస్కూల్‌లో ఘనంగా బోనాలు



భోనాలు, పోతరాజు వేషదారణ విద్యార్థులతో డైరెక్టర్ సుబ్బారెడ్డి

**హయత్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు భోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని మెగాసిటీ హైస్కూల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని మెగాసిటీ హైస్కూల్‌లో శనివారం భోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ భోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు భోనాలను ఎత్తుకోవడం, పోతరాజుల వేషదారణతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపల్ వాసు, వైస్‌ప్రిన్సిపల్ ఎన్.స్వాతి, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

## న్యూ నాగోల్ నూతన కమిటీ ఎన్నిక



న్యూ నాగోల్ నూతన కమిటీ సభ్యులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ న్యూనాగోలు కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ శనివారం ఎన్నికయింది. ఎన్నికలలో అధ్యక్షునిగా పోచంపల్లి రాజేందర్ రెడ్డి(పిఎమ్ఆర్.రాజు) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జి.మోహన్‌రాజు, కోశాధికారిగా ఏ.తిమ్మారెడ్డి, సహాయకార్యదర్శి ఏ.మల్లారెడ్డి, ఆర్గనైజెంగ్ సెక్రటరిగా శైలేందర్, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.కృష్ణవేణి, కాట శ్రీశైలంగౌడ్, నల్లబోలు సత్యనారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ.శైలేందర్, కల్చరల్ సెక్రటరీ శశిధర్‌రెడ్డి, కాలని ముఖ్య సలహాదారులుగా అనంతుల రాజారెడ్డి, అడ్వైజర్‌గా సుమతిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సలహాలు సూచనలతో కాలనీ అభివృద్ధికి నిరంతరం చేస్తానని తెలిపారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

**ఉప్పల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నేహాసింగ్ శిష్య బృందం ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాంజలి, అలరింపు, గణేశా కౌతం, జతిస్వరం, పార్వపతే, శంభో కృష్ణ, భజన, గణేశా, పంచరత్న, శ్రీరామచంద్ర, శివ పంచాక్షరి, అభంగ్, అయిగిరినందిని, కావడి చిందు, తిల్లాన తదితర అంశాలను నేహాసింగ్, జశ్విత, జ్యోష్ణ, శ్రీష్ట, శ్రీవిద్య, అనీష్, స్వీకృతి, లాస్య, తరుణశ్రీ, జాహ్నవి, అనన్య, హాంసిని, హాంసిక,హిరణ్మయి, స్వంతమయి తదితరులు తమ ప్రదర్శనలతో మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## 9న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాన్ని బస్తిలో జరుపుకోవాలి : గోపినాయక్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఈ నెల 9వ తేదీన గిరిజన హక్కుల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మూడవత్ గోపినాయక్ కోరారు. యన్‌టిఆర్‌నగర్ బంజారాకాలనీలో గోపినాయక్, జిల్లా కమిటీ సభ్యులు వి.జగన్‌నాయక్, ఎ.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రపంచ గిరిజన హక్కులదినోత్సవాలలో రాజకీయాలకు అతీతంగా గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. ఆదివాసి, గిరిజన తెగలు తమ హక్కుల సాధన కోసం నినదించాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న గిరిజన తెగల జీవన విధానం, సంస్కృతి, ఆచారాలు, ఆహార అలవాట్లపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దాడి చేస్తోందని విమర్శించారు.

## సమస్య పరిష్కారానికి చర్యలు : లచ్చిరెడ్డి



విద్యుత్ అధికారులతో కలిసి బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, ఆగస్టు 3 ప్రభాత వార్త :** బి.యన్‌రెడ్డి నగర్ డివిజన్ పోలీస్ కాలనీ, సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్ బస్తీలో కరెంటు స్తంభాలు లేక ఇబ్బందికరంగా మారిందని బస్తీ వాసులు డివిజన్‌కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ సంబంధిత ఎలక్ట్రికల్ ఇఇ రామచంద్రయ్యతో కలిసి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, పోలీస్ కాలనీ అధ్యక్షులు అజయ్‌కుమార్, పెంటయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైనేజ్ నిర్మాణ పనుల పరిశీలన



బాక్స్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బిజెఆర్‌నగర్‌లో కొనసాగుతున్న బాక్స్ డ్రైనేజ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ఈఈ లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంజిరా వాటర్ పొల్యూట్ అవుతుందని సమస్య పరిష్కరించాలని తెలిపారు.కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, జలమండలి మేనేజర్ నవీన్,వర్క్ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్,సంపత్‌రావు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే ఉపేక్షించేది లేదు

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఏ డివిజన్‌లోనైనా రోడ్లపై చెత్త వేసే వారిని ఉపేక్షించమనీ అట్టి వారికి జరిమానాలు విధిస్తామని కార్పొరేషన్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి స్పష్టం చేశారు. కమీషనర్ జి.రఘు, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిల ఆదేశాల మేరకు రోడ్లపై, ఖాళీ స్థలాల్లో, ఓపెన్ నాలాలు, చెరువుల్లో చెత్త వేసే వారికి జరిమానా విధించాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో శనివారం కార్పొరేషన్ పరిధిలో రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గమనించి వారికి రూ.500 చొప్పున జరిమానా విధించిన సానిటరీ ఇన్స్‌పెక్టర్ వారికి కార్పొరేషన్ రసీదును అందజేశారు.

## మల్కాజిగిరి సబ్ రిజిస్టర్‌గా శ్రీకాంత్

**నేరెడ్‌మెట్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** మల్కాజిగిరి సబ్ రిజిస్టర్‌గా శ్రీకాంత్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్ అరవింద్ బాబు రాజేంద్రనగర్ కు ప్రభుత్వం బదిలీ చేయడంతో. ఆయన స్థానంలో వికారాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ ను రాష్ట్ర ప్రభుత్వం మల్కాజిగిరి కి బదిలీ చేయడంతో మల్కాజిగిరి సబ్ రిజిస్టర్ గా శ్రీకాంత్ బాధ్యతలు తీసుకున్నారు.పలువురు డాక్యుమెంట్ రైటర్లు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## అల్మాగూడ, బాలాపూర్‌లలో యుజిడి పనులు ప్రారంభం : మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ 3వ డివిజన్ అల్మాస్‌గూడ రామిడిభూమిరెడ్డినగర్‌కాలనీలో, 17వ డివిజన్‌లోని బాలాపూర్ పాత గ్రామంలో కార్పొరేషన్ నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఆయా డివిజన్లలో పర్యటించిన ఆమె కార్పొరేటర్లు రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, స్థానికులతో కలిసి యుజిడి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో అల్మాస్‌గూడ మాజీ పోలీస్ పటేల్ చప్పిడి సంతోష్‌రెడ్డి, కార్పొరేషన్ డిఇ జ్యోతిరెడ్డి, అల్మాస్‌గూడ, బాలాపూర్ నాయకులు నవారు మల్లారెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్, రామిడి శూరకర్ణారెడ్డి, ఎర్ర జైహింద్ కుమార్, బాల్‌నింగని జంగయ్య, శ్రీశైలం, మహిళలు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ మండల ఎంఇఓగా శ్రీనివాస్

**అబ్దుల్లాపూర్‌మెట్ ఆగస్టు 3 ప్రభాతవార్త :** హయత్‌నగర్ మండల విద్యాశాఖ అధికారిగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో నాగర్‌కర్నూలు జిల్లా తిమ్మాజీపేట మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ హయత్‌నగర్‌కు బదిలీ అయ్యారు. హయత్‌నగర్‌లో విధులు నిర్వహించిన హీర్యనాయక్ ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీ అయ్యారు.